క్లుప్తంగా

రజత వస్త్రానికి వెండి సమర్పణ



వెండి సమర్పిస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మవారు శుక్రవారం సందర్భంగా విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారి ఉత్సవమూర్తికి పంచామృతాలు, పుణ్య నదీజలాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం చేశారు. మూల విరాట్‌కు ఏకాదశ హారతి పూజలు, వేదదర్బారు సేవ, చతుర్వేద స్వస్తి, నీరాజన మహా మంత్ర పుష్పం, సాయం సంధ్యా హారతి పూజలు చేశారు. అమ్మవారి రజత వస్త్రం తయారీకి స్థానిక బోగాది ధనుంజయరావు, సూర్య కుమారి దంపతులు 15 తులాల వెండిని, పరాంకుశం వెంకట రమణ బాబు, దేవీ మంగతాయారు దంపతులు 10 తులాలు, కొనకళ్ల తులసి ఉషారాణి కుటుంబ సభ్యులు 10 తులాలు, కొయ్యల రామకృష్ణ, సూర్యకుమారి దంపతులు (గంగన్నగూడెం) 5 తులాలు, మంచిం సత్యనారయణ, విజయలక్ష్మి దంపతులు 5 తులాల వెండిని సమర్పించినట్టు ఆలయ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. ఈనెల 24న సాయంత్రం ఆలయంలో చండీ హోమం నిర్వహిస్తామన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో పూజలు



అనంతేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: స్థానిక ముత్యాలమ్మవారి ఆలయంలో కొలువైన ముత్యాలమ్మ, అనంతేశ్వర స్వామికి ఆలయ నిర్మాణకర్త బవిరిశెట్టి మురళీకృష్ణ పద్మకుమారి దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ విగ్రహాలకు ఆలయ ప్రధాన అర్చకులు మిత్తిపాటి విశ్వనాథ శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో పంచామృత ఏకవార రుద్రాభిషేకాలు, సాయంత్రం 22 రకాల హారతి కార్యక్రమాలు నిర్వహించారు. యర్రా నాగేశ్వరావు, సత్యా దంపతులు, చోడవరపు రంగారావు, జ్యోతి దంపతులు ఉభయ దారులుగా వ్యవహరించారు.

కిరణ్ సేవలకు జోహార్లు

జంగారెడ్డిగూడెం: ఆటో మోటార్ రవాణా రంగ కార్మికుల హక్కుల కోసం ఉద్యమించిన కిరణ్‌కు ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ విప్లవ జోహార్లర్పించింది. ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో ఆటో మోటార్ రవాణా రంగ రాష్ట్ర నాయకుడిగా కార్మిక హక్కుల కోసం విశేష కృషి చేసిన కిరణ్ క్యాన్సర్‌తో ఆధపడుతూ గురువారం మధ్యాహ్నం హైదరాబాద్‌లో మృతి చెందారు. ఈ సందర్భంగా కిరణ్ చిత్రపటానికి స్థానిక ధర్మన్న స్మారక భవనంలో పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నేత, న్యాయవాది ఉద్దండం ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

మద్ది అంజన్న సేవలో యాదయ్య



యాదయ్యకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారిని తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడు సిద్దమతం యాదయ్య, ఆలయాల జేఏసీ అధ్యక్షుడు గుంటుపల్లి రామదాసులు శుక్రవారం దర్శించుకున్నారు. అనంతరం వారిని సత్కరించి స్వామి వారి చిత్రపటాలను అందజేశారు. ఆలయాల జేఏసీ సభ్యులు ఆర్‌వీ రమణ, ఏజీఎల్ నారాయణ, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీదేవి, లక్కవరం నాయీబ్రాహ్మణ అధ్యక్షుడు నూజిటి కృష్ణ, సంఘ సభ్యులు అయినవల్లి త్రిమూర్తులు, నూజివీడు ఆంజనేయులు, నూజివీటి వీరాస్వామి, సూరవరపు ప్రసాద్‌లు పాల్గొన్నారు.

ఇసుక తిన్నెలపై పారిశుధ్య పనులు



పట్టిసం ఇసుక తిన్నెలపై చెత్తాచెదారం తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

పోలవరం రూరల్: పట్టిసం మహాశివరాత్రి ఉత్సవాల సమయంలో ఇసుక తిన్నెలపై పారవేసిన చెత్తా చెదారాన్ని తొలగించే పనులు పట్టిసం గ్రామ పంచాయతీ చేపట్టింది. ఇసుక తిన్నెలపై చిరు వ్యాపారులు, భక్తులు పారవేసిన చెత్తను పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయించారు. చెత్తంతా పోగు చేసి నిప్పుపెట్టారు.

సీఎం జగన్ హయాంలోనే అభివృద్ధి

ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



కొయ్యలగూడెం : అచ్యుతాపురంలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు దంపతులు

కొయ్యలగూడెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలోనే రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే తెల్ల బాలరాజు పేర్కొన్నారు. శుక్రవారం అచ్యుతాపురంలో వైఎస్సార్ సీపీ పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మితో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 17 కొత్త మెడికల్ కాలేజీలు, రెండు లక్షల ఎకరాల భూములకు యాజమాన్య హక్కు లు, 37.5 లక్షల అసైన్డ్ భూముల సమస్యలకు పరిష్కారం, సుమారు 18 వేల కిలో మీటర్ల రోడ్ల నిర్మాణం, నాలుగు పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లు ఇలా చెబుతూపోతే ప్రతి అంశంలోనూ అభివృద్ధి అంటే ఏమిటో జగన్ ముఖ్యమంత్రిగా చేసి చూపించారని బాలరాజు వివరించారు. ఎంపీ అభ్యర్థిగా కానుమూరు సునీల్ లక్ష, ఎమ్మెల్యే అభ్యర్థి రాజ్యలక్ష్మికి 50 వేల ఓట్లు మెజారిటీకి కృషి చేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థి రాజ్యలక్ష్మి వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలను అడుగుతూ.. ఫ్యాను గుర్తుకే ఓటేయాలని అభ్యర్థించారు. తొలుత బాలరాజు, రాజ్యలక్ష్మిలకు ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి గుండు మోలు మూర్తిరాజు ఆధ్వర్యంలో మహిళలు మంగళ హారతితో స్వాగతం పలికారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతన తాతారావు, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, ఎంపీపీ గంజిమాల రామారావు, హిస్టరీ కార్పొరేషన్ డైరెక్టర్ చిక్కాల మంగతాయారు, ఎంపీటీసీ మందపాటి కుమారి, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్, పార్టీ నాయకులు అచ్యుత గోపి, ముమ్మిడి రాంబాబు, మద్దిపాటి మాధవ్, కటూరి సుబ్బారావు, తొర్లపాటి వాసు, కటూరి చంటి, పారేపల్లి చిన్నిబాబు, గుడిసెట్టి సత్యనారాయణ మల్లాది మురళి, ముమ్మిడి శివ పాల్గొన్నారు.

జగనన్నకు అండగా నిలబడదాం

లింగపాలెం : ప్రతి గ్రామం, ప్రతి కుటుంబంలో మరింత అభివృద్ధి, సంక్షేమం కోసం ఫ్యాన్ గుర్తుకే ఓటేసి జగనన్నకు అండగా నిలుద్దామని వైఎస్సార్ సీపీ చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు పిలుపునిచ్చారు. లింగపాలెం మండల వేములపల్లి గ్రామంలో వైస్ ఎంపీపీ కర్లపూడి జాన్సీ ఆనంద్, శింగగూడెం గ్రామంలో పార్టీ నేత, ప్రజాప్రతినిధులు కోటగిరి ధీరాజ్‌కృష్ణ, కోటగిరి హరీష్‌ల అధ్వర్యంలో శుక్రవారం విజయరాజు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి సీఎం జగన్‌మోహన రెడ్డిని రెండోసారి సీఎంను చేయాలని, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్, చింతలపూడి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. మేలు జరిగితేనే తనకు ఓటేయండని అడిగే దమ్ము, ధైర్యం ఒక్క సీఎం జగనన్నకే ఉందని చెప్పారు. జగనన్న రెండోసారి సీఎం అయితేనే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికీ పథకాలు అందిచిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని తెలిపారు. విజయరాజుకు గ్రామస్తులు అడుగడుగునా ఘనస్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు.

జగన్‌దే విజయం

ఎన్ని పార్టీలు ఏకమై వచ్చినా వచ్చేది జగనన్న ప్రభుత్వమేనని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా బీసీ నాయకులు, పార్టీ పరిశీలకులు నౌడు వెంకటరమణ, పార్టీ చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. శుక్రవారం శింగగూడెం ప్రచారంలో భాగంగా వారు మాట్లాడారు. అబద్ధపు హామీలు, పొత్తులతో మోసంచేయడానికి వస్తోన్న టీడీపీని నమ్మవద్దని ప్రజలకు సూచించారు. చంద్రబాబు గత ఎన్నికల్లో చెప్పిన ఒక్క హామీ కూడా నేరవేర్చలేదని, జన్మభూమి కమిటీల పేరుతో ప్రజాధనం దోచుకున్నారని గుర్తుచేశారు. ఎన్నికల హామీలన్ని నెరవేర్చిన గొప్ప నాయకుడు జగనన్న అని వివరించారు. వెనుకబడిన తరగతుల వారికి జగనన్న ప్రభుత్వంలోనే సరైన న్యాయం జరిగిందన్నారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర లెబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ దయాల నవీన్‌బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ మందలపు సాయిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు కొఠారి మోహన్, వైస్ ఎంపీపీలు మట్టా సురేష్, పార్టీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, సొసైటీల చైర్మన్లు ఉప్పలపాటి వరప్రసాద్, రెడ్డిన శ్రీను, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు, మండల బూత్ కమిటీ కన్వీనర్ ఉప్పలపాటి గోపి, నాయకులు, ప్రజాప్రతినిధులు ఏపూరి సూరిబాబు, రావి కొండయ్య, ఇనుగంటి సతీష్, కలకొండ పురుషోత్తం, శావా రాజేష్, కొప్పుల వెంకటేశ్వరరావు, పి.వేమనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లింగపాలెం : ఆదర్శనగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి విజయరాజు



లింగపాలెం : శింగగూడెంలో ప్రచారం చేస్తున్న నౌడు వెంకటరమణ, విజయరాజు

వర్జీనియాకు గిట్టుబాటు ధర



సమావేశంలో మాట్లాడుతున్న వేలం నిర్వహణ అధికారిణి గ్రేస్ మార్గరెట్

కొయ్యలగూడెం: వర్జీనియా పొగాకు మొదటి, రెండు (ఆకురేల్చు) కొట్టులకు సంబంధించి ఉత్పత్తి అయిన పొగాకుకి గిట్టుబాటు ధర లభిస్తోందని వర్జీనియా పొగాకు వేలం నిర్వహణ అధికారిణి గ్రేస్ మార్గరెట్ పేర్కొన్నారు. రైతు ప్రతినిధులతో శుక్రవారం వేలం కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుతం మొదటి రెండు కొట్లకు సంబంధించి 100 నుంచి 150 బేళ్ల వరకు రైతులు విక్రయానికి పెడుతున్నారని తెలిపారు. రైతు ప్రతినిధులు కొనుగోళ్ల ప్రక్రియలో మరిన్ని కంపెనీల ప్రాతినిధ్యం వహించేలా చూడాలని బోర్డు అధికారులను కోరారు. కాకర్ల నంది, ఎస్‌కే సైదులు, ముప్పనపల్లి వెంకటేశ్వరరావు, గెడా సత్తిబాబు, యాగంటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మదన గోపాలునికి శతకలశాభిషేకం



కలశ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలరాజు దంపతులు

కొయ్యలగూడెం: శ్రీ రుక్మిణి సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయ ప్రధాన వార్షికోత్సవ సహిత పాంచాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శతకలశాభిషేకం నిర్వహించారు. శ్రీమాన్ లక్ష్మీనారాయణ పార్థసారథి, అర్చకుడు గుడిపూడి శేషాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు హాజరయ్యారు. కలశాభిషేక పూజల్లో పాల్గొన్నారు.

నీటి వనరులను రక్షించుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రసాద్‌బాబు

జంగారెడ్డిగూడెం: జల సంరక్షణ మన మానవాళి ముఖ్యకర్తవ్యమని ప్రిన్సిపాల్ ఎన్ ప్రసాదబాబు అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా స్థానిక ఛత్రపతి శివాజీ త్రి శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సభకు ప్రసాదబాబు అధ్యక్షత వహించి మాట్లాడారు. వర్షాకాలంలో నీటిని ఒడిసి పట్టడం ద్వారా జలాలను రక్షించుకోవచ్చని, భూగర్భ జలాలు అడుగంటి పోతే మానవాళి విపత్కర పరిస్థితులు ఎదుర్కొనాల్సి వస్తుందని అన్నారు. వృక్షశాస్త్ర అధ్యాపకురాలు టి.ఝాన్సీ రాణి మాట్లాడుతూ నీటి ప్రాధాన్యత, వృక్ష సంపద మధ్య ఉన్న అనుబంధాన్ని వివరించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఉన్న వృక్షాలకు పక్షుల కోసం నీటి డబ్బాలను ఏర్పాటు చేశారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎం మధు, అధ్యాపకులు యు.వెంకటాచార్యులు, సీహెచ్ బద్రీనారాయణ, విజయ దీపిక తదితరులు పాల్గొన్నారు.

ప్రగడవరంలో ఫ్రైడే - డ్రైడే



ప్రగడవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చింతలపూడి: ప్రతి శుక్రవారం డ్రైడే పాటించడం ద్వార దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్‌కే అబ్రార్ హుస్సేన్ అన్నారు. చింతలపూడి మండలం ప్రగడవరం, వెంకంపాలెం గ్రామాల్లో శుక్రవారం ఫ్రైడే డ్రై డే అవగాహన ర్యాలీ నిర్వహించారు. మురుగు కాలువల్లో నిరుపయోగమైన ఆయిల్స్ వేయడం, దోమల సంహారిక మందులు పిచికారీ చేయడం ద్వార దోమలను అదుపు చేయవచ్చని అబ్రార్ హుస్సేన్ అన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. ప్రతి శుక్రవారం నీటి తొట్టిలను శుభ్ర పరుచుకుని పొడిగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి.భరత్ కుమార్, విష్ణుమూర్తి, అరుణ, నర్మద, సునీత, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

జగన్‌తోనే పథకాల కొనసాగింపు



ప్రగడవరంలో ప్రచారం చేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ జానకిరెడ్డి, జెడ్పీటీసీ నీరజ

చింతలపూడి: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి అన్నారు. చింతలపూడి మండలం ప్రగడవరం, యర్రంపల్లి గ్రామ పంచాయతీల పరిధిలో శుక్రవారం మేము సిద్ధం, మా బూత్ సిద్ధం కార్యక్రమం బూత్ కన్వీనర్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జానకిరెడ్డి మాట్లాడుతూ మ్యానిఫెస్టోలో హామీలన్నీ అమలుచేసి సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందించారని చెప్పారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు చేకూరిన పథకాల లబ్ధిని వివరించారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ఇచ్చే అబద్ధపు హామీలను నమ్మవద్దని ప్రజలను కోరారు. సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని జెడ్పీటీసీ ఎం నీరజా సుధాకర్ అన్నారు. ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్ యాదవ్, అసెంబ్లీ అభ్యర్థి కంభం విజయరాజులను అత్యధిక మెజార్టీతో గెలిపించి మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, సిద్ధం ప్రోగ్రాం కోఆర్డినేటర్ శింగిరెడ్డి భరత్‌రెడ్డి, ప్రగడవరం ఉపసర్పంచ్ ఎస్ రమేష్ రెడ్డి, ఎంపీటీసీ గాలంకి నాగేశ్వరరావు, రఘునాథ రెడ్డి, శీలం ధర్మారావు, నున్నా గంగాధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి



జి.కొత్తపల్లి సెక్టార్ పరిధిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, ఐసీడీఎస్ సిబ్బంది

ద్వారకాతిరుమల: గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులు చిరుధాన్యాలతో పాటు, తక్కువ ఖర్చుతో లభించే అధిక పోషకాలు గల ఆహారం తీసుకోవాలని సీహెచ్ పోతేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి యజ్ఞశ్రీ సూచించారు. మండలంలోని జి.కొత్తపల్లి సెక్టార్ పరిధిలో శుక్రవారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. పోషణ్ మార్చ్, పోషకాహార ప్రాముఖ్యతపై నినాదాలు చేస్తూ లైన్ డిపార్ట్‌మెంట్ వారితో 2కే రన్ నిర్వహించారు. పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.లక్ష్మీరాజ్యం, డాక్టర్ శ్రీజ, ఎమ్మెల్‌హెచ్‌పీ శశికళ, స్టాఫ్‌నర్స్ మమత, అంగన్‌వాడీ సిబ్బంది ఎస్ నాగమణి, బి.రామలక్ష్మి, పి.హేమలత, డి.సరోజిని, ఎస్ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిగణపవరంలో పూజలు



పుష్పాధివాసం పూజ చేస్తున్న భక్తులు

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డి గణపవరంలో కనకదుర్గమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా శుక్రవారం నిత్య, గో పూజలు చేశారు. ధాన్యాధివాసం, పుష్పాధివాసం, విశేష భూ ప్రస్తార శ్రీచక్రార్చన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మద్యం విక్రేతపై కేసు

టి.నరసాపురం: మద్యం బాటిల్స్ విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లుగా ఎస్సై డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. మండలంలోని మద్యం బాటిల్స్ కలిగి ఉన్న బండివారిగూడెం గ్రామానికి చెందిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు చెప్పారు. ఆ వ్యక్తి నుంచి ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

నిత్యావసరాల పంపిణీ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కుక్కునూరు: హోప్ చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం కుక్కునూరు మండలం అమరవరం పంచాయతీ చెరువు కొమ్ముగూడెం గ్రామంలో విద్యార్థులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న అమరవరం సర్పంచ్ కారం విజయలక్ష్మి మాట్లాడుతూ పేదపిల్లలు శారీరకంగా మానసికంగా ధృడంగా ఉంటేనే చదువుల్లో ఆట, పాటల్లో రాణించగలరని అన్నారు. ఈ సందర్భంగా ఒక్కో విద్యార్థికీ 10 కేజీల బియ్యం, ఆయిల్ ప్యాకెట్, గోధుమ రవ్వ, ఉప్మా రవ్వ, ఉప్పు ప్యాకెట్‌లు, టీపొడి ప్యాకెట్ చొప్పున 90 మందికి సర్పంచ్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో హోప్ సొసైటీ ఇన్‌చార్జి యోహాను, యాసిన్ మణికుమార్, పాస్టర్ లుకా తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

పోలవరం రూరల్: పోలవరం నుంచి ప్రగడపల్లి వెళ్లే రోడ్డు మార్గంలో శుక్రవారం ఆటోను ఒక మోటార్ సైకిల్ ఢీకొన్న ఘటనలో మోటార్‌సైకిలిస్టుకు స్వల్ప గాయాలయ్యాయి. ఆ వ్యక్తిని పోలవరం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. ఈ మార్గంలో పోలవరం డీఎస్పీ ఎన్ సురేష్‌కుమార్ రెడ్డి, సీఐ కె.మధుబాబు వెళుతుండగా ఈ ఘటన చోటు చేసుకోవడంతో వారు వెంటనే స్పందించారు. క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించేందుకు ఏర్పాట్లు చేశారు.

కోడ్ ఉల్లంఘన.. సిబ్బందిపై వేటు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన సూపరింటెండెంట్ సస్పెన్షన్‌కు గురయ్యారు. మరో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగితో పాటు 12 మంది క్షురకులను తాత్కాలికంగా విధుల నుంచి తొలగించారు. దీనిపై విచారణ చేస్తున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు టౌన్: వేసవి కాలంలో ప్రజలు వాతావరణ పరిస్థితులపై జాగ్రత్తగా ఉండాలని, ఆరోగ్య సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని ఏలూరు అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. ఏలూరు వెంకటాపురం -2 రామానగర్ కాలనీలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. వేసవిలో ఎదురయ్యే అనారోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

మెనూ బోర్డులో నాయకుల ఫొటోల తొలగింపు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన మెనూ బోర్డులో ముఖ్యమంత్రి, ఇతర రాజకీయ నాయకుల ఫొటోలను తొలగించామని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కచ్చితంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘిస్తే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు

ఏలూరు (టూటౌన్): ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జయప్రకాష్ హెచ్చరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాల్లో రాజకీయ నాయకుల ఫొటోలను తొలగించామన్నారు. దినసరి ఆహార పట్టికలోనూ సీఎం, రాజకీయ నాయకుల ఫొటోలపై స్టిక్కర్లు అతికించామని జేడీ తెలిపారు.

